అడుగంటుతున్న జలాలు

- పాకాల ఏటిలో తగ్గిన నీటి నిల్వలు
- ఎండిపోయే స్థితిలో పంటలు
- శ్రీరాంసాగర్ కెనాల్ నీళ్లు వదలాలని కోరుతున్న అన్నదాతలు



గార్ల సమీపంలో అడుగంటి పోతున్న పాకాల ఏరు

గార్ల: గార్ల సమీపంలోని పాకాల ఏటిలో నీటిమట్టం అడుగంటి పోతుండడంతో ఏటి పరివాహక ప్రాంతాల్లో రబీలో సాగు చేసిన వరిపంట ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిశాయని, పాకాల ఏటికి పైనుంచి నీళ్లు వస్తాయనే ఆశతో పాకాల ఏటి కింద రైతులు వరిపంట సాగుచేశారు. వరినాట్లు వేసి 2నెలలు గడవక ముందే, పాకాల ఏటిలో నీళ్లు అడుగంటి పోయాయని, మరో 15రోజుల్లో పాకాల ఏటిలోకి ఎస్సారెస్పీ కెనాల్ నీళ్లు రాకపోతే వరిపంట ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాకాల ఏటి పరివాహక ప్రాంతంలో గార్ల మండలంలో సుమారు 300 ఎకరాల్లో రైతులు వరిపంట సాగు చేశారు. ఆరు కాలం శ్రమించి సాగుచేసిన వరిపంటకు ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టామని రైతులు పేర్కొంటున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో చెరువులు, కుంటలు శ్రీరాంసాగర్ కెనాల్ ద్వారా నీళ్లు నింపుతున్నందున, మహబూబాబాద్, బయ్యారం, గార్ల గుండా ప్రవహించే పాకాల ఏటిలోకి సైతం శ్రీరాంసాగర్ నీళ్లు విడుదల చేసి రైతుల వరిపంటను కాపాడాలని ప్రజాప్రతినిధులను, నాయకులను, సంబంధిత అధికారులను రైతులు వేడుకుంటున్నారు.

నీళ్లు విడుదల చేయాలి



పాకాల ఏటిలో నీరు అడుగంటి పోతున్నందున వరిపంట ఎండిపోయే దశకు చేరుకుంది. పాకాల ఏటికి శ్రీరాంసాగర్ కెనాల్ నీళ్లు వదిలి వరిపంటను కాపాడాలి. మరో 15రోజుల్లో నీళ్లు రాకుంటే వరిపంట ఎండిపోయే ప్రమాదం ఉంది. నీళ్లు వదిలి పంటలను కాపాడాలి.

- గాని భద్రయ్య, రైతు, మద్దివంచ

ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కుట్రలు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



కురవి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్, పక్కన ఎంపీ బలరాంనాయక్


కురవి: ఇచ్చిన హామీలను ఏడాదిలో అమలు చేస్తూ, మడమ తిప్పని విధంగా సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు వెళ్తున్నాడని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బీఆర్ఎస్, కేసీఆర్ కుటుంబం కుట్రలు చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ విమర్శించారు. సోమవారం మండలంలోని మొగిలిచర్ల గ్రామంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ సమక్షంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక 24గంటల నుంచే ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నాడని తెలిపారు. మూడు ఎమ్మెల్సీ స్థానాల నుంచి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. నాలుగేళ్ల తర్వాతనే అసెంబ్లీ ఎన్నికలకు వెళ్తామని తెలిపారు. అనంతరం ఎంపీ బలరాంనాయక్ మాట్లాడుతూ.. పీఎం నరేంద్రమోదీ బీసీ కాదని ఓసీ అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పింది నిజమేనన్నారు. రాహుల్‌గాంధీ ఆలోచన మేరకు రేవంత్‌రెడ్డి బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే లక్ష్యంతో కులగణన చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గార్లపాటి వెంకటరెడ్డి, నాయకులు అంబటి వీరభద్రం, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పట్టుదలతో పని చేస్తున్నాం..

డోర్నకల్: నియోజకవర్గ అభివృద్ధి కోసం పట్టుదలతో పని చేస్తున్నామని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, ఎంపీ బలరాంనాయక్ అన్నారు. స్థానిక చర్చి కాంపౌండ్‌లో సోమవారం నూతనంగా నిర్మించిన బిషప్ హౌజ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎంపీలను డయోసీస్ బిషప్ రెవ.డాక్టర్ కోడిరెక్క పద్మారావు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రామసహాయం సురేందర్‌రెడ్డి, బిషప్ డాక్టర్ రైట్ రెవ కోడిరెక్క పద్మారావు, రూబెన్ మార్క్, విజయపద్మారావు, నాయకులు సుమేర్ చంద్‌జైన్, శ్రీనివాస్, వీరన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

నృత్య పోటీల్లో వేదశ్రీ ప్రతిభ



తొర్రూరు రూరల్: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరుగుతున్న జాతీయస్థాయి తాండవ కృష్ణ భారతీయ నృత్య పోటీల్లో మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన, తొర్రూరు లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్న గట్టు వేదశ్రీ ప్రదర్శించి మంచి ప్రతిభను చాటింది. సోమవారం విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

ముత్యాలమ్మ గుడి నిర్మాణానికి శంకుస్థాపన



మహబూబాబాద్ రూరల్: మండలంలోని మాధవాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ముత్యాలమ్మ తల్లి ఆలయ శంకుస్థాపన పూజలు పురోహితులు గుండోజు నాగార్జునాచార్యుల వేద మంత్రాల నడుమ సోమవారం ఘనంగా జరిగాయి. రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ రామసహాయం సురేందర్ రెడ్డి హాజరై శంకుస్థాపన పూజ నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు మాలోత్ నెహ్రూనాయక్, మద్ది వెంకటరెడ్డి, జక్కుల వెంకటరెడ్డి, వెంగలి సుధాకర్ రెడ్డి, వెంకటరెడ్డి, కొమురెల్లి పాపిరెడ్డి, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

లింగమంతుల జాతర



బయ్యారం/మహబూబాబాద్ రూరల్: బయ్యారం సమీపంలోని పెద్దగుట్ట లింగమంతులస్వామి ఆలయం వద్ద సోమవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో జాతర ఘనంగా నిర్వహించారు. భక్తులు గంపలతో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.


ఎమ్మెల్యేకు వినతి

చిన్నగూడూరు: మండలంలోని ఆకేరువాగు పైన నూతన ఆనకట్ట నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి నిధులు మంజూరు చేయించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు డీఎస్ వెంకన్న నాయక్ సోమవారం మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

గార్ల: బయ్యారంలో ఉక్కు పరిశ్రమకు తగ్గ ముడిసరుకు లేదడం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు సబబు కాదని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాసరావు అన్నారు. సోమవారం బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీటీ సంజీవకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, పోతుల నర్సింహారావు, భీముడు, లోకేష్, యశ్వంత్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

కులగణనపై విమర్శలు మానుకోవాలి



కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనపై, ప్రతిపక్షపార్టీల నాయకులు చేస్తున్న విమర్శలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు చిట్ల సంపత్ అన్నారు. సోమవారం కేసముద్రంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొల్లపల్లి మహేందర్, తరాల వీరేష్‌యాదవ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కురవి: మండల కేంద్రంతోపాటు అయ్యగారిపల్లి, నల్లెల్ల, తిరుమలాపురం, చింతపల్లి గ్రామాల్లో నేడు(మంగళవారం) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శారద సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

కాంగ్రెస్ ఒక్క సీటు గెలవదు

- మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

కేసముద్రం: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్కసీటు కూడా గెలవదని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు గారడిమాటలతో మాయచేసి సీఎం రేవంత్‌రెడ్డి గద్దెనెక్కాడన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సీటు ఇప్పుడు ఆయన చేతుల్లో లేదని, ఇక మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు ఎవరికి వారన్నట్లుగా ఉన్నారని ఆయన విమర్శించారు. కేసీఆర్ లాంటి గొప్పనాయకుడిని కాదని, కాంగ్రెస్‌కు ఓటు ఎందుకు వేశామని ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారన్నారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు పెడితే కాంగ్రెస్ ఓటమి ఖాయమనే విషయాన్ని ఇంటలిజెన్స్ వర్గాలు చెప్పడంతో సీఎం ఎన్నికలను వాయిదా వేస్తున్నాడన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు నీలం దుర్గేష్, మాజీ ఎంపీపీ వోలం చంద్రమోహన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎండి.నజీర్‌అహ్మద్, ప్రధాన కార్యదర్శి కముటం శ్రీనివాస్, కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి, ముత్యాల శివకుమార్ పాల్గొన్నారు.

అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉండాలి

గూడూరు: అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉండాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ధీరవెళ్లి భరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడారు. కొంత మంది నాయకులు ఎన్నికలు కాగానే స్వార్థం కోసం పార్టీ మారారని, అలాంటి వారిని అధిష్టానం నిర్ణయంతో సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే అన్నారు. అలాంటి వారిలో ఉన్నటువంటి మండలానికి చెందిన కొందరు జిల్లా నాయకులు జిల్లా పార్టీ అధ్యక్షురాలు అనుమతి లేకుండా, సస్పెన్షన్ ఎత్తివేయకుండా పార్టీలో చేరినట్లు కండువా కప్పుకోవడం పద్ధతికాదన్నారు. బీఆర్ఎస్ నిబంధనతో పనిచేస్తుందని, పార్టీ కోసం పని చేసే వారు కావాలి కానీ, స్వార్థం కోసం పని చేసే వారు కాదన్నారు. సస్పెన్షన్‌కు గురైన వ్యక్తులు ఆ సస్పెన్షన్ ఎత్తివేసిన తరువాత పార్టీ కండుకప్పుకోవాలన్నారు.

ఫేక్ కాల్స్ నమ్మొద్దు

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్ పేరిట ఫోన్లు చేసి ట్రేడ్ లైసెన్స్ చెల్లించమని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు మున్సిపల్ కార్యాలయ దృష్టికి వచ్చిందని అలాంటి ఫేక్ కాల్స్‌ను నమ్మవద్దని కమిషనర్ నోముల రవీందర్ సోమవారం తెలిపారు. ఇలాంటి కాల్స్ వస్తే వెంటనే మున్సిపల్ కార్యాలయంలో గానీ, పోలీసులకు గానీ వెంటనే సమాచారం ఇవ్వాలని తెలిపారు.

బీసీ వాదాన్ని గెలిపించుకోవాలి



మేనిఫెస్టో గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కురవి: బీసీల ఓట్లు బీసీలకే వేసుకోవాలని, బీసీవాదాన్ని గెలిపించుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం కులగణన సర్వే చేయడం అభినందనీయమని హిందూ మహాసభ వ్యవస్థాపకుడు బత్తుల సిద్ధేశ్వర్, సామాజిక వేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. హిందూ మహాసభ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలోని బీసీ సమరయోధుల గ్రామాలను కలుపుతూ హైదరాబాద్ గోల్కొండ కోట నుంచి ఖిలా వరంగల్ కోట వరకు 800కిలోమీటర్ల పాదయాత్ర ఆదివారం ముగిసింది. దీనిని పురస్కరించుకుని వీరభద్రస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. సాంబశివరావు రచించిన బీసీ మేనిఫెస్టో అనే గ్రంథాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కొండ బత్తుల యాదగిరి, రాపర్తి శ్రీనివాస్, ఆంజనేయులు, తిరుపతి, మహేష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

కురవి: కడుపునొప్పి భరించలేక వృద్ధుడు బాదావత్ రాములు(70) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని నేరడ శివారు బాల్యతండాలో సోమవారం చోటుచేసుకుంది. రాములు కొద్ది రోజులుగా కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. నొప్పి భరించలేక ఈనెల 2న ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కురవి ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపారు.

బీరిశెట్టి గూడెంలో యువకుడు..

దంతాలపల్లి: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బీరిశెట్టి గూడెం గ్రామానికి చెందిన మిదుతపల్లి ఎల్లమ్మ, మైసయ్యల కుమారుడు మిదుతపల్లి ప్రశాంత్(28)కు వచ్చిన పెళ్లి సంబంధాలు కుదరకపోవడంతో మనస్తాపానికి గురయ్యేవాడు. దీనికి తోడు తండ్రి మైసయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అనేక సమస్యలు తోడవడంతో మద్యానికి బానిసై శనివారం ఎవరు లేని సమయంలో గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. తల్లి ఎల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై పిల్లల రాజు తెలిపారు.

పెన్షన్ రాక రిటైర్డ్ ఉద్యోగుల ఇబ్బందులు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: సీపీఎస్, యూపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 2వ తేదీన ఇందిరాపార్క్ వద్ద జరిగే ఉద్యోగ, ఉపాధ్యాయుల యుద్ధభేరిని విజయవంతం చేయాలని రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కె.మోబిన్ అహ్మద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద యుద్ధభేరి పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిటైర్మెంట్ జరిగి ఏళ్లు గడుస్తున్న పెన్షన్ రాకపోవడంతో రిటైర్డ్ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎండి.రఫీక్, బత్తుల శ్రీనివాస్, మల్లేష్, సింగు రమేష్, కుడితి వెంకట్‌రెడ్డి, స్వరూపరాణి, వీరూ నాయక్, డోలి అనిల్‌కుమార్, సత్యనారాయణ, వెంకట్ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్/కేసముద్రం/నెల్లికుదురు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మండల వెంకన్న డిమాండ్ చేశారు. హామీల అమలు కోసం ఈనెల 20వ తేదీన జరిగే చలో హైదరాబాద్ విజయవంతం చేయాలని వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పాపయ్య, భట్టు చైతన్య, లక్ష్మయ్య, ఏకాంబ్రం, శ్రీను పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డిని గెలిపించాలి



మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

మహబూబాబాద్ అర్బన్: చాలీచాలని వేతనాలతో బతకలేని బడిపంతులుగా ఉన్న రోజుల నుంచి గౌరవ ప్రదమైన వేతనాలతో ఐటీ చెల్లించే స్థాయికి ప్రభుత్వ ఉపాధ్యాయులు రావడం వెనక పీఆర్టీయూ కృషి ఉందని సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బి.మోహన్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన సోమవారం జిల్లాలో ప్రచారం చేశారు. పీఆర్టీయూ బలపరిచిన అభ్యర్థి పింగళి శ్రీపాల్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంక బద్రినారాయణ, సతీష్ రెడ్డి, నాయకులు రాఘవరెడ్డి, వెంకట్‌రెడ్డి, గాయత్రి, కీర్తనారెడ్డి, రాంజీ పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు



తొర్రూరులో అంజనేయస్వామి దేవాలయంలో వేడుకల్లో పాల్గొన్న నాయకులు



గూడూరు: పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు సోమవారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఆస్పత్రులో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కేసీఆర్ తన ప్రాణాలను లెక్క చేయకుండా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు అన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



డోర్నకల్: కేసీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు

సంక్షిప్త సమాచారం

మాజీ ఎమ్మెల్యే క్షమాపణలు చెప్పాలి

మహబూబాబాద్ రూరల్: మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు శంతన్ రామరాజు డిమాండ్ చేశారు. సేవాలాల్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ పట్ల మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ పట్టణంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు కోల సత్యం, కమ్మగాని కృష్ణమూర్తి, గోనె శ్యామ్ రావు, అల్వాల లాలయ్య పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

నెహ్రూసెంటర్: జిల్లాలో గల ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించాలని కిసాన్ పరివార్ సీఈఓ డాక్టర్ వివేక్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారికి సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ బీమానాయక్, ఎల్ఎస్ఓ జిల్లా అధ్యక్షుడు శివవర్మ నాయక్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

గూడూరు: ప్రభుత్వానికి అవసరమైన పలు సేవలను అందించుటలో పాల్గొనే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డీటీఎఫ్ మండల అధ్యక్షుడు బోడ దూప్‌సింగ్ కోరారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ, ఎస్టీఓ కార్యాలయంలో సోమవారం మండల డీటీఎఫ్ సంఘం ఆధ్వర్యంలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందించారు.

మండలాన్ని సీఐ సర్కిల్‌గా ఏర్పాటు చేయాలి

నెల్లికుదురు: నెల్లికుదురు మండల కేంద్రాన్ని సీఐ సర్కిల్‌గా ఏర్పాటు చేయాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని కోరినట్లు యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి మధన్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

వాలీబాల్ కిట్ల వితరణ

గార్ల: గార్ల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక నెహ్రూసెంటర్‌లో క్రీడాకారులకు వాలీబాల్ కిట్లను అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ జిల్లా, నియోజకవర్గ నాయకులు ఎస్‌కె యాకూబ్‌పాషా, భూక్యా బాబూలాల్‌లు వాలీబాల్ క్రీడాకారులకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వీరస్వామి, నయీమ్, శాంతికుమార్, సురేష్ పాల్గొన్నారు.

వీరన్న సన్నిధిలో పూజలు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో నూతన బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన పేరుతోపాటు కుటుంబసభ్యుల పేర్లపై గోత్రనామార్చనలు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీరామోజు నాగరాజు, నాయకులు వద్దిరాజు రాంచందర్‌రావు, చీకటి మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో రైతులు సుభిక్షం

పెద్దవంగర: కాంగ్రెస్ పాలనలో రైతులు సుభిక్షంగా ఉంటారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని రామచంద్రు తండాలో ఎస్సారెస్పీ ఉప కాలువల్లో పేరుకపోయిన పూడికతీత పనులను ఆయన ప్రారంభించారు.కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు జాటోతు వెంకన్న, మండల యూత్ అధ్యక్షుడు బీసు హరికృష్ణ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తొర్రూరు రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలను కాపాడుకోవలసిన బాధ్యత అధ్యాపకుల పైనే ఉందని రాష్ట్ర ఇంటర్ విద్యాశాఖ డైరెక్టర్ కృష్ణ ఆదిత్య అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ ఎస్సీ, ఎస్టీ అధ్యాపకుల అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు.

స్టడీ మెటీరియల్స్ అందజేత

కేసముద్రం: మండలంలోని కల్వల జెడ్పీ హైస్కూల్‌లో ఎస్ఎఫ్‌హెచ్‌సీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పాలిటెక్నిక్, డిక్షనరీలు, గురుకులం ఎంట్రన్స్ పరీక్షల స్టడీ మెటీరియల్స్‌ను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బండారు నరేందర్, పీఎస్ హెచ్ఎం వీరారెడ్డి, సుమన్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

మహబూబాబాద్ అర్బన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.లక్ష్మణ్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రా రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.

జాగ్రత్తలు పాటించాలి

గూడూరు: ప్రాణాంతకమైన ఎయిడ్స్‌పై తగు జాగ్రత్తలు పాటించాలని భూపాలపల్లి జిల్లా మారి సంస్థ ప్రతినిధులు నెల్లూరి రజిని, బుర్రి మౌనిక అన్నారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, మారి సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు.

నోట్ బుక్స్ పంపిణీ



నర్సింహులపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం కేసీఆర్ బర్త్‌డే సందర్భంగా 100 మంది విద్యార్థులకు బీఆర్ఎస్ కార్యకర్తలు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రమేశ్, రామన్న, వెంకన్న, మధు, శ్రీనువాస్ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

నర్సింహులపేట: మండలంలోని వివిధ పాఠశాలలకు 2008డీఎస్సీకి చెందిన ఏడుగురు ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. సోమవారం తనకు వచ్చిన ఆర్డర్ కాపీతో ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ రామ్మోహన్‌రావుకు రిపోర్ట్ చేశారు.

గూడూరు: డీఎస్సీ-2008 ద్వారా మండలానికి ముగ్గురు ఉపాధ్యాయులను కేటాయించినట్లు ఎంఈఓ రవికుమార్ సోమవారం తెలిపారు.

భూమి ఇప్పించాలంటూ ఆందోళన



డోర్నకల్: తన కుమారుడు ఆక్రమించిన తన భూమిని తనకు ఇప్పించాలంటూ ఓ వృద్ధురాలు ఆందోళన చేపట్టింది. మండలంలోని గొల్లచర్ల గ్రామానికి చెందిన తాటికొండ కమలమ్మ అనే వృద్ధురాలి భర్త 45ఏళ్ల క్రితం మృతిచెందగా ముగ్గురు కుమారులు మల్లారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రతాపరెడ్డితో పాటు కుమార్తె వెంకమ్మ ఉన్నారు. 2018లో కమలమ్మ పేరున ఉన్న 349, 30 సర్వే నంబర్లలోని రెండెకరాల భూమిని తన పెద్ద కుమారుడు మల్లారెడ్డి తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని కమలమ్మ ఆరోపించారు. తన భూమిని తన పేరిట మార్చాలని చాలాసార్లు కోరినా పట్టించుకోలేదని ఆరోపిస్తూ సోమవారం గొల్లచర్ల క్రాస్ రోడ్డులోని మల్లారెడ్డికి చెందిన దుకాణాల వద్ద ఆందోళనకు దిగింది.